# మతమా! నీ విలువెంత?

డల్లాస్ ఎయిర్‌పోర్ట్ ఎప్పుడూ చాల హడావిడిగా ఉంటుంది. ప్రతిరోజూ కొన్ని వందల విమానాలు అక్కడ దిగటమో, అక్కడి నించి వెళ్లటమో చేస్తుంటాయి. రెండు మూడు లైన్లలో నుంచుని, ఒక్కొక్క విమానమూ దిగి, రెండు మూడు లైన్లలో ఎయిర్ పోర్ట్‌లోకి రావటమూ చూస్తుంటే, ఇంత ట్రాఫిక్‌ని ఎలా నడిపిస్తున్నారా అని ఆశ్చర్యం వేస్తుంది. లుఫ్తాన్సా వారి - డల్లాస్ నించి ఫ్రాంక్‌ఫర్ట్ వెళ్లే విమానం కోసం ప్రయాణీకులు ఎదురు చూస్తున్నారు. అక్కడ కూర్చుని, గోపీచంద్ వ్రాసిన 'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా' చదువుతూ, ఫ్లయిట్ ఎనౌన్స్‌మెంటు కోసం ఎదురు చూస్తున్నాడు రామకృష్ణ. అతనికి, ఆ నవలలో వేదాంతపరంగా, గోపీచంద్ వ్రాసిన వాదోపవాదాలు అంటే చాల ఇష్టం.

రామకృష్ణకి కొంచెం దూరంలో స్థంభం దగ్గర నుంచుని, దీక్షగా వచ్చేపోయే జనాన్ని చూస్తూ నుంచుని ఉన్నాడు అతను. అతనికి నున్నటి గుండు. నున్నగా గీసిన మీసం. కాని చిన్న గడ్డం మాత్రం రాగి రంగులో ఉంది. శరీరపు రంగు అటు తెలుపు కాదు, పసుపూ కాదు, వింతగా ఉంది. అతను కనీసం ఆరడుగుల నాలుగంగుళాల పొడవు ఉంటాడు. కళ్ళు తీక్షణంగా ఉన్నాయి. ఏదో సాలోచనగా చూస్తుంటాడు ఎప్పుడూ. అతని పేరు మనకు తెలియదు. కనుక అతన్ని 'రాగి రంగు గడ్డం అతను' అందాం. అతని చేతిలో ఒక పుస్తకం ఉంది. దాని అట్ట మీద - 'ఈజ్ రెలిజియన్ ఎ మిత్, బిలీఫ్ ఆర్ రియల్' అని వ్రాసి ఉంది. సన్నగా, పొడుగ్గా నల్లగౌను వేసుకుని ఉన్న ఒక క్రిష్టియన్ ఫాదర్ వచ్చి, రామకృష్ణ ప్రక్కనే కూర్చున్నాడు. అతను బ్రీఫ్‌కేస్ తెరిచి, తన బిజినెస్ కార్డు తీసి, చేతిలో పట్టుకుని, రామకృష్ణ వేపే చూస్తున్నాడు. రామకృష్ణ, తన చదువు ధ్యాసలో తనున్నాడు.

కొంచెం దూరంగా ఒక నల్ల అతను, తెల్ల అమ్మాయి - రువాండాలో ప్రజలు, ఆహారం లేక ఎంత కష్టపడుతున్నదీ, కలరాతో ఎలా చచ్చిపోతున్నదీ చెబుతున్నారు. వాళ్ళు రువాండాకి సహాయం అందించే ఒక సహాయ సమితికి విరాళాలు అడుగుతున్నారు. కొంతమంది, వాళ్లను చూసి చూడనట్టు వెళ్ళిపోతున్నారు. కొంతమంది ఆగి, విని, ఏమీ ఇవ్వకుండా వెళ్ళిపోతున్నారు. కొంతమంది విరాళాలు ఇచ్చి, ఇంకా వివరాలు కూడా అడుగుతున్నారు.

క్రిష్టయన్ ఫాదర్, రామకృష్ణ ఏకాగ్రతను భగ్నం చేస్తూ - 'ఎక్స్‌క్యూజ్‌మీ' అన్నాడు. గోపీచంద్ వ్రాసిన అరవిందుని వేదాంతసారామృతాన్ని గ్రోలుతున్న రామకృష్ణ తలెత్తి ఆయన్ని చూశాడు.

"నా పేరు జాన్‌డేవిడ్ - నన్ను జాన్ అని పిలవండి చాలు' అన్నాడు చేయి చాపుతూ.

'నా పేరు రామకృష్ణ' అతనికి షేక్‌హేండిచ్చాడు.

'మీరు హిందువులా?' సూటిగా అడిగాడు జాన్.

రామకృష్ణ ఒక క్షణం తత్తరపడ్డాడు. కొంచెం కోపం కూడా వచ్చింది. తను ఎవర్నీ, వాళ్ళ మతం గురించి గానీ, కులం గురించి గానీ ఎప్పుడూ అడగలేదు. తను ఎవర్నీ ఆ విషయాలు అడగటం అన్నది కూడా ఇష్టం లేదు అతనికి. అందుకే అన్నాడు, 'అది మీకనవసరం - మీ సంగతి మీరు చూసుకోండి!' అని.

జాన్ ఆ మాటకి కొంచెం నొచ్చుకున్నాట్టున్నాడు - 'మిమ్మల్ని అలా సూటిగా అడిగినందుకు క్షమించండి - ఊరికే తెలుసుకోవాలనుకుని అడిగాను!'

రామకృష్ణ తాపీగానే అన్నాడు - 'మీకు తెలుసుకోవాలనుందేమో కానీ, నాకు మాత్రం చెప్పాలని లేదు. నేను మీ మతం గురించి అడగటం లేదు, మీరు నా మతం గురించి అడగకండి!'

'మీకు కోపం మరీ ఎక్కువలాగా ఉంది - పోనీ మీరు ఇండియాకి చెందినవారా!'

'నేను అమెరికన్ని - కాకపోతే ఇరవై యేళ్ళ క్రితం, ఇండియా నుంచి వచ్చి ఇక్కడే ఉండిపోయాం!' మరీ అన్ని ప్రశ్నలకూ ఎదురు చెప్పటం బాగుండదని, అన్నాడు రామకృష్ణ.

జాన్ అన్నాడు - 'నేను మీకొక విషయం చెప్పాలి. రాముడూ, కృష్ణుడూ లాటి హిందూ దేవుళ్ళు నిజం కాదు. వాళ్ళు ఇతిహాసాలలోని పాత్రలు. వాళ్ళకు దైవత్వం ఆపాదించి, ప్రార్థనలు చేసే మతాన్ని, సభ్యసమాజం హర్షించదు. జీసస్ క్రైస్ట్ నిజంగా, పుట్టి, పెరిగాడు. ప్రత్యక్షంగా మతాన్ని స్థాపించి, ప్రజలకు ఒక మార్గం చూపించాడు. కిరస్తానీ మతం యదార్థమైన మతం. ఆ విషయం గురించి మీతో మాట్లాడాలని ఉంది!' అంటూ తన చేతిలోని బిజినెస్ కార్డ్ని రామకృష్ణకు అందించాడు.

రామకృష్ణకు ఈసారి బాగా కోపం వచ్చింది - అయినా నెమ్మదిగా అన్నాడు -- 'నాకు నీతో మాట్లాడాలని లేదు. ఎందుకంటే నీకు హిందూమతం గురించి అసలు తెలిసినట్లు లేదు. నువ్వు చెప్పిన దాంట్లో హిందూమతం పట్ల ద్వేషం తప్ప తెలివిగల వాదన ఏమీ కనపడటంలేదు - 'ఫిజిక్స్' అంటే తెలియని ఒక ఆసామీ దగ్గరకు వెళ్ళి, అతనికి ఏమీ తెలుసుకోవాలని లేకపోయినా, ఒక ఫిజిక్స్ ప్రొఫెసర్గా - 'థియరీ ఆఫ్ రెలెటివిటీ' గురించి చెప్పటం శుద్ధదండుగ. ఆ కారణంగా నీతో మాట్లాడటం బుద్ధి తక్కువ. కనుక మనం అసలు ఆ వాదనలోకి దిగటమే అనవసరం. నేను చదువుకోవాలి - నన్ను వదిలేసి - ఇంకెవరినన్నా తగులుకో!'

రాగిరంగు గడ్డం అతను వీళ్ళ మాటలు విన్నట్టున్నాడు - కళ్ళు చిట్లించి ఆసక్తిగా వీళ్ళనే చూస్తూ నించున్నాడు.

'ప్రతివాళ్ళు, ఆవేశంతో ఇలాగే అంటారు ముందు. నా దగ్గర కొన్ని పుస్తకాలు ఉన్నాయి - అవి మీకు ఇస్తాను. తీరిగ్గా ఉన్నప్పుడు చదవండి. కానీ మీరు ఎంత తొందరగా మేలుకుంటే అంత మంచిది. ఇంకొక విషయం, ఈ పుస్తకాలు దాదాపు నూట యాభై డాలర్లు ఖరీదు చేస్తాయి. అవన్నీ మీకు నేను ఉచితంగా యిస్తాను. మీకు అసలయిన మతం మీదా, దేవుడి మీదా నమ్మకం కలిగించడమే నా ఉద్దేశ్యం.'

'అంతేనా - నాలాటి పరమతాల వాళ్ళను పట్టుకుని, కిరస్తానీలను చేసి, మతం మార్చుకున్న ప్రతి ఒక్కడి తరఫునా మీ చర్చి దగ్గర వంద డాలర్లు వసూలు చేసుకోవడమే మీ ధ్యేయమా - మతం పేరుతో మీరు చేసే వ్యాపారం నాకు తెలుసు!' కొంచెం కటువుగా అన్నాడు రామకృష్ణ.

రాగిరంగు గడ్డం అతను - ఆసక్తిగా వింటూ - అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుని, చెవులు రిక్కించాడు.

'అది నిజం కాదు- పాపులను రక్షించి, మంచిమార్గం చూపించటమే మా ఉద్దేశ్యం'

రామకృష్ణకు ఈ మాటతో సహనం పూర్తిగా పోయింది.

'ఏమిటయ్యా నీ గోల - నీతో ఇంతదాకా మాట్లాటమే నేను చేసిన పాపం. నీతో హిందూ మతం గురించి చెప్పటం అనవసరం. కోకాకోలా అమ్మకు బ్రతికేవాడి దగ్గర పెప్సీ గొప్ప చెప్పడం శుద్ధ టైమ్ వేస్ట్ - కనుక - నన్ను వదిలేసి, ఇంకెవరినయినా తగులుకో ఫో.' ఆ సీటులోంచి లేచి, ఎదురుగా ఉన్న ఐస్‌క్రీం షాప్‌లోకి వెళ్ళాడు రామకృష్ణ, మనసుని కాస్త చల్లబరుచుకుందామని.

జాన్ కూడా ఇక లాభం లేదకుని, ఇంకెవరు దొరుకుతారా అని చుట్టూ చూస్తున్నాడు. రాగి రంగు గడ్డం అతను మాత్రం తనలోతానే నవ్వుకున్నాడు. చిరునవ్వు అతని పెదిమల మీద లీలామాత్రంగా మెరిసింది. అతనికి కొంచెం వెనకగా కూర్చుని, ఈ జరిగిన భాగోతమంతా చూస్తున్నాడు ఇరాజ్. అతను ఇరాన్ నుంచి వచ్చి అమెరికాలో స్థిరపడిపోయాడు. ఇప్పుడు తన వాళ్ళను చూడటానికి, టెహ్రాన్ వెడుతున్నాడు. జాన్ కళ్ళు ఇరాజ్ మీద పడ్డాయి. ఇరాజ్ కూడా తననే చూస్తున్నందువల్ల, జాన్ అతన్ని చూసి, చిరునవ్వు నవ్వి, ఇరాజ్ వేపు నడిచాడు.

రువాండో సహాయ సమితివాళ్ళు జాన్‌కి ఎదురుగా వచ్చి - ఏవో కాగితాలు అందించారు. రువాండాలో ప్రజలు ఆహారం, సహాయం లేక ఎలా చనిపోతున్నారో చెబుతున్నారు. జాన్ వాళ్ళను విసుక్కుని, ఒక ప్రక్కకు తోసి, ఇరాజ్ వేపు నడిచాడు. అంతగా దేవుడి గురించి మాట్లాడిన జాన్, కష్టాల్లో ఉన్న తోటి మానవులకు ఏమీ సహాయం చేయకపోవటంతో, రాగిరంగు గడ్డం అతని మనస్సు చివుక్కుమంది. ఏ మతమయినా, మంచి చేయమని, మానవ సేవే మాధవ సేవ అని చెబుతుంది. మరి మతం గురించి ప్రచారం చేసేవాళ్ళు, ఆ మతం పట్ల ఏ మాత్రం మర్యాద లేకుండా, మానవత్వాన్ని మరచి ప్రవర్తించటం, తోటి మానవులు చచ్చిపోతున్నా సహాయం చేయకపోవటం -అతనికి ఒక విధమైన ఏహ్యభావాన్ని కలిగించింది. తప్పు మతానిదా ? ఆ మతం పేరుతో ముసుగు కప్పుకుని, స్వలాభం కోసం చూసే పెద్దమనుషులదా - ఇదే ఆలోచిస్తున్నాడతను.

జాన్, ఇరాజ్ మాట్లాడుకునే మాటలు అతనికి వినిపిస్తూనే వున్నాయి. ఇరాజ్ చెబుతున్నాడు - వెస్ట్‌బాంక్‌లో ముస్లింలకు, జ్యూలకు ఎలా గొడవలు జరుగుతున్నాయో, 'రష్యా నించి, పోలెండ్ నించి వచ్చేవారు జ్యూలయితే చాలు - ఇజ్రాయిల్‌కి రాగానే పౌరసత్వం ఇస్తారు. వాళ్ళలో ఒకళ్ళలాగా చూస్తారు. మరి అక్కడే జీవితాంతం - తరాల

తరబడి ఉన్న - పాలస్తీన్ ముస్లిమ్‌లు మాత్రం పరాయివాళ్ళే - వాళ్ళని తుపాకులతో తరుముతారు - ఆడవాళ్ళనీ, పిల్లల్నీ కూడా పిట్టల్ని కాల్చినట్లు కాలుస్తారు - అది మతోన్మాదం కాదా? వాళ్ళ దేవుడు దాన్ని సమర్థిస్తాడా - ' జాన్ ఆ మాటలు ఏమి వింటున్నట్లు లేదు - తన మతాన్ని 'అమ్మడానికి' ప్రయత్నం చేస్తున్నాడు. 'అల్లా రక్షించటం వలన, ముస్లింల సంఖ్య పెరుగుతున్నది ప్రపంచంలో. లేకపోతే - మీ మతపిచ్చి మనుషులంతా ముస్లింలను బలి తీసుకొనేవాళ్ళు - ఖొమైనీ ఇది గ్రహించే - ప్రపంచంలోని ముస్లింలందరికి సందేశాలు ఇచ్చాడు- ' అంటున్నాడు ఇరాజ్. జాన్ నోరు మూయిస్తున్న ఇరాజ్ వాదం విస్మయాన్ని కలిగించింది రాగి రంగు గడ్డం అతనికి. అతని మాటల్లో కొంత నిజమూ కనిపించింది, మిగతా మతాల మీద అతని దురభిమానమూ కనిపించింది.

ఇరాజ్ లేచి తనూ ఐస్‌క్రీం షాపులోకి వెడుతున్నాడు. రువాండా సహాయ సమితి వాళ్ళు అతనికి కాగితాలు అందిస్తున్నారు. తెల్ల అమ్మాయి విషయం చెబుతుంటే, నల్ల అతను ఫోటోలు చూపిస్తున్నాడు. ఇరాజ్ వింటూనే జేబులు తడుముకుని - 'చిల్లరలేదు' అన్నాడు.

ఈలోగా లూఫ్తాన్సా అమ్మాయి, ప్రయాణీకులను విమానం ఎక్కటానికి ఆహ్వానిస్తూ - జర్మన్ లాంటి ఇంగ్లీష్‌లో - మైకులో పిలుస్తున్నది. రామకృష్ణ గబగబా గేటు వేపు నడిచాడు - తనవేపు వస్తున్న రువాండా సహాయ సమితి వాళ్ళను చూడనట్టు నటిస్తూ. అందరూ విమానం ఎక్కే ప్రయత్నంలో, గేటు కేసి నడుస్తున్నారు. రువాండా సహాయ సమితి వాళ్ళు, కొంచెం అవతలగా ఉన్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ వారి గేటు దగ్గరకు బయల్దేరుతున్నారు.

రాగిరంగు గడ్డం అతను గబగబా వాళ్ళకేసి నడిచాడు. జేబులోనించి, కొన్ని డాలర్లు తీసి వారికి అందించాడు. ఆ అమ్మాయి భుజం తట్టి, 'మంచి పని చేస్తున్నారు' అన్నాడు - అంటూనే తనూ, విమానం ఎక్కడానికి గేటువేపు నడిచాడు. రామకృష్ణకి ఎప్పుడూ కిటికీ దగ్గర సీటు అలవాటు. ఈసారి కూడా కిటికీ దగ్గరే అడిగి తీసుకున్నాడు. అతని ప్రక్క సీటులో ఇరాజ్ కూర్చున్నాడు. నాలుగు సీట్ల అవతల, జాన్ కూర్చుని - నూటయాభై డాలర్ల పుస్తకాల్లో ఒక పుస్తకం తెరిచాడు. విమానం బయల్దేరి, ముప్పయ్యైదు వేల అడుగుల ఎత్తుకు వెళ్లాక, డ్రింక్స్ తీసుకువచ్చింది అందమైన జర్మన్ స్టువార్డెస్. చిక్కటి జర్మన్ బీరు తాగుతూ అన్నాడు ఇరాజ్ - - 'ఆ ఇవాంజిలిస్ట్‌ని చూశారా - వాళ్ళకు అదో రోగం - మిగతా మతాల వాళ్ళను క్రిష్టయన్స్‌గా మార్చడం'

రామకృష్ణ నవ్వి ఊరుకున్నాడు.

'చాలా మంది హిందువులను - బుద్ధిస్టులను - ముస్లింలను కూడా - మతం మార్చుకోమని డబ్బులిచ్చి ప్రోత్సహిస్తున్నారు!'

'అవును -ఇండియాలో ఇది చాల ఎక్కువ' అన్నాడు రామకృష్ణ.

'షా - ఇరాన్‌ని పాలించేటప్పుడు వీళ్ళు కూడా ముస్లింలను మతం మార్పించటం, మతానికి వ్యతిరేకంగా నడిపించటం చేశారు కానీ - అల్లా దయ వల్ల ఖొమైనీ పరిపాలన వచ్చింది. అప్పటి నుంచీ అక్కడ అసలైన ఇస్లామ్ మతాన్నే పాటిస్తున్నారు అంతా. ఖొమైనీ

చనిపోయిన తర్వాత కూడా, ముస్లిం రాజ్యమే ఉంది అక్కడ.'

'అవును' - అన్నాడు రామకృష్ణ తల ఊపుతూ.

'మీ ఇండియాలో అయోధ్య విషయంలో జరిగిన హిందూ, ముస్లింల గొడవలు గురించి చదివాను - నేను ఏ మాత్రం అది హర్షించలేదు'-

రామకృష్ణకు, జాన్‌తో మతం గురించి ఎందుకు వాదించలేదో అదే కారణాల వల్ల, ఇరాజ్‌తో కూడా మతం గురించి మాట్లాడటానికి ఇష్టపడలేదు. 'పదవీ వ్యామోహంతో కుతంత్రవాదులయిన రాజకీయ నాయకులు, అమాయకులైన ప్రజలను ఆవేశపరిచి, స్వలాభం కోసం చేసిన ఘోరం అది - నేను ఈ రెండు మతాలను వెనకవేసుకుని వచ్చి, దేశాన్ని చిన్నాభిన్నం చేసిన, రాజకీయ నాయకుల గురించి మాట్లాడుతున్నా. వాళ్ళందరూ దేశద్రోహులు. అన్ని వర్గాల వారు, చాల సున్నితమైన - 'మతం' అనే ప్రాతిపదిక మీద ప్రజలను కోపోద్రిక్తులను చేసి, ఆ ఆవేశంతో ఒళ్ళు మరచిన వాళ్ళని స్వలాభం కోసం ఉపయోగించుకుంటున్నారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు - అది క్షమించరాని నేరం.'

వెనక సీటులో కూర్చుని, అంతా వింటున్న, రాగిరంగు గడ్డం అతను ఆలోచిస్తున్నాడు - మతం మనిషికి ఉపశమనం కలిగిస్తుందా - ఉన్మాదుడ్ని చేస్తుందా - మతం ఎంతవరకు సమ్మతం? దాని సరిహద్దు ఏమిటి? మతం లేకపోతే మనిషి బ్రతకలేడా? పరమతాల మీద దురభిమానం, మతం అంగీకరిస్తుందా? మానవత్వం లేకుండా ప్రవర్తించే వాళ్ళకు, మతం మీద నిజంగా గౌరవం ఉన్నదా? క్రిష్టియన్స్, జ్యూలు, హిందువులు, ముస్లింలు, సిక్కులు - తమ మతంతో పాటు మిగతా మతాలను కూడా గౌరవిస్తే, సమానంగా చూస్తే, ఈ ప్రపంచంలో - కనీసం మతపరంగా - శాంతి ఉండదా? రకరకాల ఆలోచనలు, అతని తెలివితేటలను పరీక్షిస్తుంటే, ఆలోచిస్తూనే అలసిపోయి, నిదురపోయాడు. అలా ఎన్ని గంటలు నిద్రపోయాడో తెలియదు కానీ, అంతా గోలగా ఉంటే కళ్ళు తెరిచాడు.

విమానం ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టు మీద, ముప్పయ్యారోసారి తిరుగుతున్నది.

జరిగిన విషయం - విమానం లాండింగ్ గేర్ క్రిందకు దిగటంలేదు. మెకానికల్ ప్రాబ్లెం అంటున్నాడు పైలట్. విమానం లాండింగ్ గేర్ లేకుండా, క్రిందకు దిగితే, ఆ రాపిడికి తగలబడే ప్రమాదం ఉంది. అంతేకాదు, విమానంలో పెట్రోలు అంటుకుని, విమానం పేలిపోతుంది కూడాను. అందుకని క్రిందనున్న కంట్రోలు టవర్‌వాళ్ళు పెట్రోల్ అయిపోయేదాక పైనే తిరిగి, అప్పుడు జాగ్రత్తగా క్రిందకు దిగమన్నారు. ఈలోగా ఎమర్జెన్సీ లాండింగ్ కోసం, క్రింద ఎయిర్‌ఫోంలో దాదాపు పాతిక ఫైర్ ఇంజన్లూ, వంద అంబులెన్సులూ సిద్ధం అవుతున్నాయి.

ఈ విషయం తెలిసిన ప్రయాణీకుల్లో భయభ్రాంతులతో పాటు పెద్ద ఆందోళన కూడా చెలరేగింది. స్టువర్డెస్‌లు ఎమర్జెన్సీ లాండింగ్‌కు తీసుకోవలసిన జాగ్రత్తలు చెబుతున్నారు.

ఇరాజ్ చేతులు పైకెత్తి అల్లాను ప్రార్థిస్తున్నాడు - 'నువ్వే అసలయిన దేవుడివి - నన్ను రక్షించు. నా ప్రాణం కాపాడు. నీ దైవత్వాన్ని నిరూపించు' అని వేడుకుంటున్నాడు.

ప్రక్కసీటులో కూర్చున్న రామకృష్ణ తన ఇష్టదైవమైన వెంకటేశ్వస్వామికి మ్రొక్కున్నాడు. 'నువ్వే ఆపద మొక్కుల వాడివి - రక్షించు. బ్రతికి బయటపడితే, తిరుపతికి వచ్చి నా ఉంగరాల జట్టును నీకు సమర్పించుకుంటాను' అని నమస్కారం చేశాడు.

రెండు సీట్ల అవతల కూర్చున్న జాన్ - రెండు భుజాలమీదా, నుదురు మీదా చేత్తో తట్టుకుని - 'జీసస్ - నువ్వే యదార్థమైన దేవుడివి. నా పాపాలన్నీ కడిగి, నన్ను రక్షించు - బిడ్డలను రక్షించవలసిన బాధ్యత తండ్రిది. కనుక ఓ తండ్రీ - కరుణించు' అని కళ్ళు మూసుకుని ధ్యానిస్తున్నాడు.

పైలట్ మైకులో అంటున్నాడు. - 'మీరు ఏమీ భయపడకండి - ఇప్పుడు విమానంలో పెట్రోలు అయిపోయింది. ఇక క్రిందకు దిగటమే తరువాయి. నాకు విమానం నడపడంలో ఇరవై ఏళ్ళ అనుభవం ఉంది. నా శాయశక్తులా, అతిజాగ్రత్తగా నేల మీద దించుతాను. దానికి మీరు సహకరించాలి - మీరు గాభరా పడకుండా మా స్టాఫ్ చెప్పినట్లు చేయండి - గుడ్‌లక్!'

అతని మాటలు విని కొంతమంది ఏడవటం ప్రారంభించారు. కొంతమంది పక్కవాళ్ళకు ధైర్యం చెబుతున్నారు. ఒక ముసలాయన మధ్యకు వచ్చి పెద్దగా అన్నాడు 'అందరూ దేవుడి మీద భారం వేసి, రక్షించమని వేడుకోండి - ధైర్యంగా ఉండండి- ఆ దేవుడే కాపాడుతాడు.' ముందు సీట్లో అప్పటిదాకా కూర్చున్న ఒక యువకుడు చటుక్కున లేచాడు - పెద్దగా నవ్వాడు - నవ్వు ఆపి అన్నాడు - 'నేను నాస్తికుడిని. నాకు దేవుడు లేడు - కానీ మీకందరికీ తలో దేవుడూ - మీ అందరిదీ తలొక మతం - ఇప్పుడు ఎవరు మిమ్మల్ని రక్షించేది - క్రీస్తా - అల్లానా - కృష్ణుడా - లేకపోతే దేవుళ్లందరూ కూడ పలుక్కుని వచ్చి రక్షిస్తారా ?' అరిచాడు. మళ్ళీ పెద్దగా నవ్వి అన్నాడు ఒక మతం దేవుడు, ఇంకో మతం వాళ్లని రక్షిస్తాడా?' అని.

ఎదురుగా ఉన్న లావాటి ఆవిడ అన్నది - 'నాకు ఏ దేవుడు రక్షిస్తాడన్నది ముఖ్యం కాదు. నాకు బ్రతకటం ముఖ్యం. నన్ను ఏ దేవుడు రక్షిస్తే, ఆ దేవుడే నా దేవుడు. ఆ మతమే నా మతం - మా అమ్మాయిని చూసి పదిహేను సంవత్సరాలయింది. ఇప్పుడు మా అమ్మాయిని చూసే మహత్తర అవకాశం రాబోతున్నది. క్రింద ఎయిర్‌పోర్టులో గాభరాపడుతూ ఉంటుంది పిచ్చి పిల్ల - నేను బ్రతకాలి. మా అమ్మాయిని కలవాలి - నువ్వే దేముడివైనా సరే - దేముడా! నన్ను రక్షించు.'

రాగిరంగు గడ్డం అతను ఈసారి చిరునవ్వు కాకుండా కొంచెం పెద్దగా నవ్వాడు - 'మతం మిధ్యా, నమ్మకమా, నిజమా' అన్న పుస్తకం అతని ఒళ్లో భద్రంగా ఉంది. జాన్ చేతులు పైకెత్తి నమస్కారం పెడుతున్నాడు - 'దేవుడా - నువ్వెవరివైనా సరే - ఏ మతానికి చెందిన వాడవయినా సరే - నా ప్రాణం కాపాడు - నా ప్రాణం కాపాడితే, నువ్వే మతం పుచ్చుకోమన్నా ఆనందంగా చేస్తాను'- కళ్ళు మూసుకుని అందరి దేవుళ్ళనూ ధ్యానిస్తున్నాడు.

ఇరాజ్ మనసులోనే అనుకుంటున్నాననుకుని, పైకి అన్నాడు - 'అల్లా - కృష్ణా - ఏసు ప్రభువా - మీలో ఎవరయినా సరే - నా ప్రాణం కాపాడి నన్ను రక్షించండి' అని. రామకృష్ణ 'దేవుడనే వాడు అన్ని చోట్లా, అన్ని రకాల మతాల్లోనూ, మనుషుల్లోనూ వున్నాడు. ఏ

పేరయితేనేం - ఈశ్వరుడూ, అల్లా ఒక్కరే అన్నాడు గాంధీమహాత్ముడు. దేవుడా - నన్ను బ్రతికించు' అనుకున్నాడు.

రాగిరంగు గడ్డం అతను ఈ విచిత్ర పరిణామానికి విభ్రాంతి చెందాడు. అతనికి అంతా కలలాగా వుంది. ఇంతకు ముందు దాకా, తమ మతాలు తప్ప మిగతా మతాలను తక్కువగా చూసిన మనుష్యులు, ప్రాణభీతి రాగానే - ఏ మతమైనా సమ్మతమే - బ్రతికి బయటపడితే చాలు - అనే ఆలోచనకు రావడం విస్మయాన్ని కలిగించింది. ఈ సంఘటన మతం గురించి నిజాలు తెలుసుకొనే మహత్తర అవకాశంలా భావించాడతను.

విమానం క్రిందకు దిగడం ప్రారంభించింది. అందరూ ఊపిరి బిగపట్టారు - కొంతమంది స్పృహ తప్పి పోయారు - కొందరు చెమటలు కక్కుతున్నారు. ఈలోగా పెద్ద శబ్దం. విమానం నేల మీదకు దిగింది. రన్‌వే మీద నుంచి, ప్రక్కనున్న గడ్డిలోనుంచి సరసరా దూసుకుపోతున్నది. కుదుపులతో ఎగిరెగిరి పడుతున్నది. అందరూ కళ్ళు మూసుకుని కూర్చున్నారు. ఊపిరి బిగపట్టారు. విమానం కుదుపులతో, పెద్దగా శబ్దం చేస్తున్నది- పిడుగులు పడుతున్నట్లుగా - రాపిడికి చుట్టూ పొగ - అక్కడ కూడా మంటలు.

పైలట్ చాలా మెలుకువగా, విమానాన్ని గడ్డి మీద నిలిపాడు. గబగబా ఎమర్జన్సీ తలుపులు తెరిచారు. గాలితో నిండిన ప్లాస్టిక్ పరుపులు తెరువబడ్డాయి. పదిహేను నిముషాల్లో, అందరినీ క్రిందకు దించేశారు. ఫైర్ ఇంజన్లు విమానాన్ని నీటితోనూ, ఫోమ్‌తోనూ తడిపేస్తున్నాయి, మంటలు వ్యాపించకుండా. ఎవరికీ ప్రాణాలు పోలేదు. విమానం ప్రేలిపోలేదు. నర్సులూ, డాక్టర్లు - అందర్నీ గబగబా చెక్ చేస్తున్నారు. దెబ్బలు తగిలిన వాళ్లకీ, స్పృహ తప్పిన వాళ్ళకీ ప్రథమ చికిత్స చేస్తున్నారు.

'అల్లా దయామయుడు - అందర్నీ రక్షించాడు' అని అల్లాని ప్రార్థించాడు ఇరాజ్ చేతులు పైకెత్తి.

'క్రీస్తు కరుణాసాగరుడు - తను ఉన్నానని నిరూపించాడు' పెద్దగా అన్నాడు జాన్ - రెండు భుజాల మీదా, నుదిటి మీదా చేతితో తట్టుకుంటూ.

'బొంబాయి నించి - సరాసరి తిరుపతికి వెళతాను' అనుకున్నాడు రామకృష్ణ.

లావాటావిడ మనసంతా, చాలా సంవత్సరాల తర్వాత చూడబోతున్న తన కూతురి మీదే ఉంది. ఆవిడ కళ్ళల్లో నీళ్ల తిరుగుతున్నాయి.

రాగి రంగు గడ్డం అతను వీరందర్నీ పరీక్షగా చూశాడు. ఈసారి అతని పెదిమల మధ్య చిరునవ్వు లేదు. అతను - సరాసరి ముందుకు వెళ్ళి - అక్కడే నుంచుని ఎయిర్‌పోర్టు ఇంజనీర్లతో మాట్లాడుతున్న పైలట్‌ని చూశాడు. 'మా ప్రాణాలు కాపాడినందుకు ధన్యవాదాలు' అని పైలట్‌ని హృదయానికి హత్తుకున్నాడు.

పైలట్ అతని చేతిని మృదువుగా నొక్కి 'అది నా ఉద్యోగ ధర్మం' అన్నాడు నవ్వుతూ. రాగిరంగు గడ్డం అతని నీళ్ళు నిండిన నీలం కళ్ళు మాత్రం ప్రాణాలు కాపాడిన ప్రత్యక్ష దైవాన్ని చూస్తున్న ఆనందంతో, మిలమిలా మెరుస్తున్నాయి. ✻